www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం జులై 11 2024
5
చిత్తూరు



నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జనాభా నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో 11వ తేదీ గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గోడ పత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, కుటుంబ నియంత్రణ, లింగ సమానత్వం, మాతృఆరోగ్యం వంటి జనాభా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రపంచ జనాభా దినోత్సవం లక్ష్యమన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి, అదనపు డీఎంహెచ్వో డాక్టర్ వెంకటాప్రసాద్, ఎస్ఓ జార్జ్, ఇంచార్జ్ డెమో జయరాములు, శ్రీవాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి





- అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలి
- కోర్కెల దినోత్సవం సందర్భంగా నిరసనలు, వినతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కార్మిక సమస్యలపై డిమాండ్స్ డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం ఎదుట సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌ను పర్మినెంట్ చేయాలని, అంగన్వాడీ, ఆశ, మిడే మీల్స్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.జ్యోతి, జిల్లా నాయకులు ఆరోగ్యదాసు, ఆటో యూనియన్ నాయకులు ప్రసాద్, డప్పు కళాకారుల సంఘం నాయకులు జోసఫ్, హమాలీ వర్కర్స్ యూనియన్ ఆనంద్, నాగరాజా పాల్గొన్నారు.

అలాగే యాదమరి మండలంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షకీలా ఆధ్వర్యంలో అంగన్వాడీలు ర్యాలీ నిరసన తెలిపారు. అనంతరం అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. 42 రోజుల సమ్మె సందర్భంగా మంత్రులు, అధికారుల సమక్షంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వెదురుకుప్పం: దేశవ్యాప్తంగా కోర్కెల దినోత్సవం సందర్భంగా కార్వేటినగరం ప్రాజెక్టులో అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిరసన అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీనరసమ్మ, మమత కోశాధికారి విజయ మాట్లాడుతూ కేంద్రంలోని కేంద్రం ప్రభుత్వం అంగన్వాడీలకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరైనది కాదని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్వేటినగరంలో గంగాధర నెల్లూరు శాసనసభ్యులు మీకోసం ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడీలు భాను, రెడ్డమ్మ, జయ, ఉమా, వల్లి నాగమ్మ మంజుల పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు ప్రాజెక్టులో అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిరసన అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఆధ్యక్షులు గిరిధర్ గుప్తా, ఓబులరాజు, అధ్యక్ష కార్యదర్శులు పద్మమ్మ, అనసూయ, నాయకులు ధనమ్మ, రాణి, రెడ్డమ్మ, ప్రభావతి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యను పరిష్కారం చేయాలని, 42 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పట్టణంలోని ఎద్దులసంత వీధిలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, 30 మంది కార్మికులు గిరిధర్ గుప్తా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆంజనేయ, రవి, శ్రీరామయ్య, లక్ష్మయ్య, గోపి, రఘు, రత్నమ్మ, బాబు, మణి, వరలక్ష్మి, భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

శాంతిపురం: దేశవ్యాప్తంగా కోర్కెల దినోత్సవం సందర్భంగా శాంతిపురం ప్రాజెక్టులో అంగన్వాడీలు ర్యాలీ నిరసన అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశ్యారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ లీడర్లు శోభ, రేవతి, శైలజ ఎర్రమ్మ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: స్కీం వర్కర్లకి ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షులు వరలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు డిప్యూటీ తహశీల్దార్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. శశికళ, నారాయణ, జానకి, భారతి పాల్గొన్నారు.







అర్జీల పరిష్కారంపై త్వరితగతిన చర్యలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జూన్ 25, 26వ తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా అందిన అర్జీల పరిష్కారంపై త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశమై అర్జీల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 25, 26వ తేదీల్లో కుప్పం పర్యటనలో భాగంగా ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంపై సంబంధిత శాఖలు వెంటనే స్పందించి అర్జీలకు సరియైన ఎండార్స్మెంట్ ఇస్తూ చూడాలన్నారు. సర్వీస్‌కు సంబంధించిన అంశాలు, ఆర్థిక సంబంధమైన అర్జీలకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికను పంపాలన్నారు. ప్రతి శాఖ వారీగా వారికి అందిన అర్జీలపై తీసుకొన్న చర్యలను జిల్లా అధికారులు కలెక్టర్ కు వివరించారు. మరో 10 రోజుల తర్వాత ఇదే అంశంపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ ఎన్ రాజశేఖర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ జె.అరుణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఉదయం కమిషనర్ వేలూరు రోడ్డు, గంగినేని చెరువు, గిరింపేట, దుర్గమ్మ గుడి, కలెక్టరేట్ సర్కిల్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. గంగినేని చెరువు వద్ద పారిశుద్ధ్య వాహనాల లాగ్ పుస్తకాలను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల దృష్ట్యా అవసరమైన అదనపు ట్రిప్పులు నడపాలన్నారు. ఎక్కడా వ్యర్థాలు కనిపించరాదని అన్నారు. గంగినేని పార్క్ లోపల, బయట పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలని కార్యదర్శులను ఆదేశించారు. ఉదయం ఏడు గంటల కల్లా ప్రధాన రహదారుల స్వీపింగ్ పూర్తి చేయాలని, అనంతరం వీధుల శుభ్రత, ఇంటింటి చెత్త సేకరణ పకడ్బందీగా చేయాలన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ -2024, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలో భాగంగా గ్యాంగ్ వర్క్‌ల నిర్వహణ పక్కాగా నిర్వహించాలని, పారిశుద్ధ్య పనుల విషయంలో ఎక్కడ నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ అమర్నాథ్ రెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

వార్డుల్లో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడం కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చెప్పారు. బుధవారం ఉదయం ఎమ్మెల్యే, మేయర్ ఎస్.అముద, కమిషనర్ డాక్టర్ జె.అరుణ, స్థానిక నాయకులతో కలిసి 48వ వార్డు పరిధిలో మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇందిరానగర్‌లో ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా? స్థానికంగా ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. వీధిలో ఉన్న మట్టిదిబ్బలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తంగవేలు కాలనీలో పెద్దకాలువలను పరిశీలించారు. స్థానికుల వినతి మేరకు కాలువలో పూడిక తీయడానికి చర్యలు చేపట్టాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. అనంతరం రాజీవ్ నగర్, వన్నియర్ వీధిలో పర్యటించారు. వన్నియర్ వీధిలో కాలువ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఈసందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా వార్డుల్లో పెద్దఎత్తున కాలువల్లో పూడికతీత కార్యక్రమం జరుగుతోందన్నారు. ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు కమిషనర్ ఎమ్మెల్యేకి వివరించారు. యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన మేర అన్ని కాలువల్లో పూర్తిస్థాయిలో పూడిక తొలగిస్తామని వివరించారు.

వరసిద్ధుని సేవలో ఎంపి



ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద మాజీఛైర్మన్ మనినాయుడు ఎంపికి స్వాగతం పలికారు. ఆలయ అధికారులు రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. వేద పండితులు, వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించారు. ఆలయం బయట చిత్తూరు ఎంపీ మీడియాతో మాట్లాడుతూ వినాయకస్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజల అండదండలతో తాను పార్లమెంట్లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశానన్నారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులందరితో కలిసి చర్చిస్తానన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించడం కోసం చర్యలు చేపట్టడం జరుగుతున్నదని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరం బియ్యం, కందిపప్పు, నూనె, దాణ్యాల హోల్‌సేల్ అసోసియేషన్ డీలర్సుతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం, కందిపప్పు, నూనె ధరలను నియంత్రణ చేయుటకు ప్రత్యేక కౌంటర్‌లను ఎంపిక చేయబడిన ఈ కింద కౌంటర్స్‌లో నాణ్యమైన ఫైన్ వెరైటీ బియ్యంను స్టీమ్ బియ్యం కేజీ రూ.49లు, పచ్చి బియ్యం కేజీ రూ.48లకు నాణ్యమైన కందిపప్పు (దేశవాళీ) కేజీ రూ.165లకు విక్రయించుటకు హోల్‌సేల్ అసోసియేషన్ డీలర్‌లు సమన్వయంతో 11 వ తేదీ గురువారం నుంచి కౌంటర్స్‌లో అమ్మకాలు ప్రారంభించనున్నట్లు జెసి తెలిపారు.

జిల్లా ప్రతిష్ట పెరిగేలా కలసి పనిచేద్దాం: ఎంపి

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సమన్వయంతో పని చేయండి: కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ప్రతిష్ట పెరిగేలా జిల్లా అభివృద్ధికి అందరూ కలసి పని చేద్దామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. బుదవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఎంపితో కలిసి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు సంబంధించిన అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎంపీ ల్యాండ్స్ ద్వారా మంజూరు అయ్యే పనులను నాణ్యత పూర్తి చేయాలని ఇందుకు సంబంధించిన విధి విధానాలను తప్పక పాటించాలన్నారు. ప్రభుత్వం ద్వారా ఖర్చు చేసే ప్రతి పైసా పేదలకు చెందేలా పాలన అందించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రతిష్టను ఇనుమడింప చేసేలా జిల్లా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిధులతో అమలవుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్జీవన్ మిషన్, నేషనల్ హెల్త్ మిషన్, అమృత్ సరోవర్‌లతోపాటు వివిధ సంబంధిత శాఖల ద్వారా అమలవుతున్న పథకాలకు సంబంధించిన వివరాలను ఎంపికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, ఇరిగేషన్, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఎస్ఈలు విజయ్ కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, విజయ్ కుమార్, జడ్పీ సీఈఓ గ్లోరియా, హౌసింగ్, డిఆర్డిఏ, మెప్మా పీడీలు పద్మనాభం, తులసి, రాధమ్మ, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, డిపిఓ లక్ష్మి, సిపిఓ సాంబ శివారెడ్డి, సాంఘిక సంక్షేమ, బిసి సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాష, శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యానవన, ఎపిఎంఐపి శాఖల అధికారులు మురళీ కృష్ణ, మధుసూదన్ రెడ్డి, బాల సుబ్రహ్మణ్యం, డిఎల్‌డిఓ రవి కుమార్, ఈఈ టిక్కో వెంకటముని, డీఈఓ దేవరాజులు అధికారులు పాల్గొన్నారు.

'సమస్య మీది.. పరిష్కారం మాది'కి విశేష స్పందన

ప్రజాశక్తి- కార్వేటినగరం: సమస్య మీది.. పరిష్కారం మాది.. అనే కార్యక్రమం బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో జరిగింది. ఈసమావేశంకు ఎమ్మెల్యే డాక్టర్ థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులకు వినతులను పంపి ప్రతి అర్జీని చదివి ఆయాశాఖలలో సమస్య పరిష్కారం దిశగా చర్య తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. మండలం నుంచే కాకుండా వెదురుకుప్పం, రంగరాజపురం మండలాల నుంచి కూడా ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్, ఎమ్మెల్యేలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరి ఆర్డీవో వెంకటరెడ్డి, తహసిల్దార్ పుష్పకుమారి, ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, ఎంఈఓ విజయ్ కుమార్, మనోజ్ కుమార్, పశు వైద్యాధికారి హేమకుమార్, సిడిపిఓ పద్మ సునంద, ఏపీవో జాహ్నవి, ఏపిఎం విజయకుమార్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ శాలువతో ఘనంగా సన్మానించారు.



ఎస్సి భూముల్లో వైసీపీ నేతల దౌర్జన్యం

పెట్రోల్ పోసుకున్న మహిళా రైతులు

ఎమ్మెల్యే మాట్లాడటంతో వెనుదిరిగిన అధికారులు



ప్రజాశక్తి- వెదురుకుప్పం

మండలంలోని దేవరగుడిపల్లి పంచాయతీకి సంబంధించిన సిజెఎఫ్ ఎస్సి భూముల్లో ఎస్ఆర్ పురం మండలం బోడి దేవరపల్లి గ్రామానికి చెందిన మునికృష్ణయ్య అనే వ్యక్తి, బొమ్మయ్యపల్లెకి చెందిన వైసీపీ నేత, మరో ఇద్దరు కలిసి అక్రమంగా చొరబడి ఆ భూమి తమ పేరుపై ఉందని దౌర్జన్యానికి దిగారు. బుధవారం తమ పేరుపై పట్టాలు ఉన్నాయని, కోర్టు ఆర్డర్ ఉందని ఆర్డీఓని, ఎమ్మార్వోని తీసుకొని వచ్చి భూమిని సర్వే చేయించడానికి ప్రయత్నించారు. ఆ భూముల్లో పది మంది రైతులు జెసిబి సాయంతో భూమిని చదును చేసి మామిడి చెట్టు పెట్టి, వేరుశనగ పండిస్తూ జీవిస్తున్నారు. అయితే ప్రస్తుతం మునికృష్ణయ్య ఆర్డీఓ, ఎమ్మార్వోలను తీసుకొచ్చి తమకు చెందిన భూమిని లాక్కోవని చూస్తే పెట్రోల్ పోసుకుని చినిపోతామంటూ మహిళా రైతులు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. వెంటనే పక్కనున్నవారు అడ్డుకున్నారు. బాధిత రైతులు మాట్లాడుతూ ఈ భూమిల్లో తమ తాతాల కాలం నుంచి ఉన్నాయని తమకే సొంతమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వాధికారులు భూములు ఆక్రమంగా కబ్జా చేస్తున్న వారికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. తమకు చెందిన భూములను కాజేయాలని చూస్తే చావే శరణ్యమని వాపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే థామస్ ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడి వెంటనే అక్కడి నుంచి వెళ్లాలని, తానే వచ్చి సమస్య గురించి తెలుసుకుంటానని తెలపడంతో అధికారులు వెనుదిరిగారు.

కుప్పం పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- కుప్పం



రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నారా చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా కడాను తిరిగి ప్రారంభించారు. కడా నూతన ప్రత్యేక అధికారిగా వికాస్ మరమ్మత్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కడా తిరిగి ప్రారంభమైన వెంటనే పట్టణ పరిధిలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీస్తూ కడా సిబ్బంది స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అభివృద్ధి చేస్తామని అధికారులు తెలిపారు. కాగా కొత్తపేట అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతూ స్థానిక నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రికి, తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు ప్రత్యేకంగా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కుప్పం న్యాయస్థానంతోపాటు అప్పట్లో సమితి కార్యాలయంగా పిలవబడి నేడు మండల అభివృద్ధి కార్యాలయంగా మారిన ఎండిఓ కార్యాలయం కొత్తపేట ప్రాంతంలో ఉండేదని తెలిపారు. కొన్ని కారణాల చేత న్యాయస్థానంతో పాటు మండల అభివృద్ధి కార్యాలయం సైతం కొత్తపేట నుండి తరలించడం జరిగిందన్నారు. తద్వారా కొత్తపేట అభివృద్ధి కుంటుపడిందని, కావున ప్రస్తుత ప్రభుత్వం కొత్తపేటపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో కొత్తపేట అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించడం జరిగిందన్నారు. కొన్ని కారణాల చేత మార్కెట్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారిందని వీటిపై ప్రత్యేక దృష్టిని సాధించి, మార్కెట్ యార్డ్ స్థానంలో ఆర్డీవో, కడా, డిఎస్పి కార్యాలయాలను నెలకొల్పాలని కోరారు. అదేవిధంగా కొత్తపేట పరిధిలోని వినాయక దేవాలయం వెనక ఉన్న ప్రాచీన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఆధునీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, కొత్తపేట ఇంచార్జ్ ముఖేష్, మైనారిటీ విభాగ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, 13వ వార్డు అధ్యక్షులు మణి, లోకేష్, భరత్, కృష్ణ, సుకుమార్, అన్సర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

లోకేష్‌ను కోరిన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి- పూతలపట్టు:



పూతలపట్టు నియోజకవర్గం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కోరారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆయన మర్యాదలు పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం మంత్రికి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసిన పూతలపట్టు అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళడంతో పాటుగా, ఐటీ పరిశ్రమలు, ఇతర పెట్టుబడులపై చర్చించారు. అంతే కాకుండా నియోజకవర్గంలో వెనుకబడిన పాఠశాల పునరుద్దరణ, హాస్టల్స్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించినట్టు సమాచారం. పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.

ప్రతి గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యలపై తనదైన శైలిలో స్పందిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం ప్రజాసమస్యలను తెలుసుకునేలా నగరపాలక సంస్థ పరిధిలో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్నారు. చిత్తూరు అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా ముందుకు కదులుతున్న ఎమ్మెల్యే మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి నెల రోజులు పూర్తికావడంతో చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో పాత బస్టాండు, కూరగాయల మార్కెట్, రైతు బజార్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలించి సంబంధిత అధికారులకు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఉన్న అవకాశాలపై ఆదేశాలు జారీ చేశారు. అత్యాధునిక సౌకర్యాలతో కూరగాయల మార్కెట్ ఆధునీకరణకు ఆమోదం తెలిపారు. గురువారం నుంచి డయల్ యువర్ ఎమ్మెల్యే పేరుతో ప్రజాఫిర్యాదులను ఫోను ద్వారా స్వీకరించనున్నారు. ప్రజల నుంచి అందిన సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. 'డయల్ యువర్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి చిత్తూరు నగరపాలక సంస్థ, చిత్తూరు రూరల్, అర్బన్, గుడిపాల మండలాల అధికారులు హాజరుకానున్నారు. చిత్తూరు నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడానికి ప్రతి గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య 98499 07885 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాశక్తి- పుంగనూరు: దీర్ఘకాలంగా ఉన్న మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణమూర్తి కోరారు. స్థానిక బిఎంఎస్ క్లబ్ ఆవరణంలో జాతీయ మత్స్య దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసమావేశానికి పట్టణ టిడిపి నాయకులు సివిరెడ్డి, దేశాధి ప్రకాష్, పోలీస్ గిరి, నాగాల కుమారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో చెరువుల ఆక్రమణలకు గురైతే వాటిని గురించి పట్టించుకోలేదని మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగిందని చెప్పారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఆదుకుంటామని చెప్పారని, అవి మాటలు వరకే మాత్రం నిలిచిపోయే అన్నారు. కూటమి పాలనలోనైనా మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే జీవో నెంబర్217 రద్దు చేయాలని కోరారు. మత్స్యశాఖ ద్వారా ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలు మత్స్యకారులకు ఆశించిన స్థాయిలో అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి వెంటనే ప్రభుత్వం స్పందించి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవి కమేశ్వర్, దొరస్వామి, జి.మునస్వామి, సెక్రటరీ పి.రఘుబాబు జి.గంగారాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

కలెక్టరేట్ ఎదుట ఏపీ ఉద్యోగుల సంఘం నిరసన



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐక్యవేదిక ఛైర్మన్ సూర్యనారాయణపై ఉన్న అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శివయ్య, జిల్లా కార్యదర్శి జిఎస్ హరిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం డిఆర్ఓ పుల్లయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఒకటో తేదీని ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని రాష్ట్ర గవర్నర్ కలిసినందుకు ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్, ఏపిజిఎల్ఐసి డబ్బులు వాడుకుందని ప్రశ్నించినందుకు అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు బాలాజీ రెడ్డి, కోశాధికారి దేవకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవినేని నరేష్ బాబు, గౌరీ శంకర్, జిఎస్ చలపతి రెడ్డి, హరిప్రసాద్, మనోజ్ కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

'సుచి' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



ప్రజాశక్తి- పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం సుచి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కోలార్‌లోని నారాయణ ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండెకు సంబంధించి ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించడంతో మండలంలోని నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి గుండె పరీక్షలను చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గుండె వైద్య నిపుణులు కిరణ్, నరేష్ ప్రాథమిక వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ, సుచి సంస్థ సభ్యులు ఎంఎస్ మనీ, చిన్నయ్య, జాకబ్, జాన్సన్, వరదరాజులు పాల్గొన్నారు.

'వైద్య సిబ్బందిపై దాడి అమానుషం'

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: విధుల్లో ఉన్న వైద్య సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని వైద్య అధికారి శిరీష అన్నారు. బుధవారం బంగారుపాల్యం కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సుమతి బాయ్ ఆధ్వర్యంలో సిబ్బంది నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు. శిరీష మాట్లాడుతూ తిరుపతి రుయా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వర్తిస్తున్న యశోదపై దాడి జరిగిందని, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు విధులు చేపడుతుంటే సిబ్బందిపై దాడి చేయడం మంచి సంస్కృతి కాదని, దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించి, ఈ దాడులు తిరిగి జరగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వైద్యాధికారులు స్వరూప్, షాలిని, విజయ కుమారి, మండలం కార్యదర్శి నిజాముద్దీన్, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సాఫీగా సాగిన కౌన్సిల్ సమావేశం



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ ఎక్స్ అఫిషియో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా పలమనేరు శాసనసభ్యులు ఎన్.అమరనాథ రెడ్డికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో పాటు మున్సిపల్ అధికారులు ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో అధికారకంగా అఫిషియల్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేపట్టగా మున్సిపల్ చైర్పర్సన్ చాముండేశ్వరి సుధాకర్, వైస్ చైర్మన్ రవితో పాటు పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, తహసిల్దార్ రంగనాయకులు వారికి పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎక్స్ అఫిషియో సభ్యులుగా అమర్నాథరెడ్డి మాట్లాడుతూ పలమనేరు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పలమనేరు అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఇక ప్రస్తుతం జిల్లాను వణికిస్తున్న డయేరియా, డెంగీ వ్యాధుల పట్ల అధికారుల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఇక ప్రధానంగా పలమనేరు పట్టణంలో గంజాయి అధికంగా లభిస్తుండంతో ఆకతాయిల చేష్టలు అన్ని ప్రాంతాలలో ఎక్కువయ్యాయని దీన్ని వెంటనే అరికట్టాలని కౌన్సిలర్ కిరణ్ కుమార్ సభ దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందని దీనిపై దృష్టి సారించాలని కౌన్సిలర్ కోదండరామయ్య కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇక చెక్ డ్యాములు పూర్తిగా దెబ్బతిని నీటి సమస్యకు కారణం అవుతున్నదని కౌన్సిలర్ హైదర్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పలువురు కౌన్సిలర్లు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రస్తావించారు. ఇలా ఉండగా కౌన్సిల్ సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై ఒకరిద్దరు అధికారులు చెప్పిన సమాధానాలు అసంతృప్తిగా ఉండటంతో వారి తీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఏదేమైనా బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఎటువంటి వాదవోపవాదాలు లేకుండా సవ్యంగా సాగింది.

విద్యార్థులకు రక్త పరీక్షలు



ప్రజాశక్తి- సోమల: సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ గట్టువారిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మహేంద్ర రక్తపరీక్షలను నిర్వహించారు. విద్యార్థులలో ఎవరికైనా జ్వరం ఉందా లేదా అని తెలుసుకునేందుకు రక్తపరీక్షలు నిర్వహించామని వీటిని ల్యాబ్‌కు పంపించి ఫలితాలు రాగానే అవసరమైన వారికి వైద్యపరీక్షలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

16న వాహనాల బహిరంగ వేలం

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు ఎస్బీ స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడ్డ వాహనాలు వేలం వేస్తున్నట్లు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్ఇబిఈ ఎస్పి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో వాహనాలు బహిరంగ వేలం వేయనున్నట్లు చెప్పారు. అడిషనల్ ఎస్పి సుబ్బరాజు ఆదేశాల మేరకు 16న బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. పుంగునూరు ఎస్ఈబి స్టేషన్ ఆభరణంలో వాహనాలు బహిరంగ వేలంపాట నిర్వహిస్తామని అన్నారు. వేలం పాటలు పాల్గొని వారు డిపాజిట్ మొత్తం చెల్లించి ఆధార్ కార్డు చూపి వేలంలో పాల్గొనాలన్నారు. ఒక కారు, ఒక ఆటో, ద్విచక్ర వాహనాలు 23 మొత్తం 25 వాహనాలు వేలం వేస్తున్నట్లు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీలో

తేడాలు వస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం పంపిణీ చేసే పౌష్టికాహారం కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు తదితరాలను విద్యార్థులకు పంపిణీ చేయడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని చౌడేపల్లి సిడిపిఓ రాజేశ్వరి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్వాడీ వర్కర్స్ ఆయాలతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తూ పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తుందన్నారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు ప్రసవానంతర స్త్రీలకు పంపిణీ చేసేటప్పుడు సరైన మోతాదులో గుర్తించిన వారికి అందరికీ పంపిణీ చేయాలని కోరారు. సమావేశానికి ముందు మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలను అందజేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ హరిత అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని తూగుంద్రం పీహెచ్సీ పరిధిలోని ప్రతి గర్భిణీ సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటేనే మాత శిశు మరణాలు జరగవని వైద్యాధికారిని మౌనిక తెలిపారు. బుధవారం తూగుంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారంతో పాటు పండ్లరసం, ఆకుకూరలు, ఎక్కువ నీరు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణీలు నెలసరి వైద్యపరీక్షలు తప్పక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కృష్ణమ్మ, పలువురు నర్సులు పాల్గొన్నారు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణీలకు డాక్టర్ ప్రవీణ వైద్యపరీక్షలు నిర్వహించారు. మండలంలో ఉన్న 70 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

గ్రామాల్లో అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పెద్దపంజాణి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలోని గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం సూచించారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో సర్పంచ్లకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారివారి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో డ్రైనేజీలు, తాగునీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉండేటట్లు ఎప్పటికప్పుడు చూసుకోవాలని అదేవిధంగా క్లోరినేషన్ చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలి అవకాశం ఉండడం వల్ల ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పంచాయతీ కార్యదర్శితో కలిపి గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పట్టణ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ప్రజాశక్తి- పలమనేరు: పట్టణంలోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని పిపిఎస్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్లై, కార్యదర్శి నరసింహులు, గౌరవాధ్యక్షులు ఆనందబాబులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. బుధవారం పలమనేరు పరిరక్షణ సమితి (పిపిఎస్) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను సన్మానించడం జరిగింది. ఈసందర్భంగా వారు పట్టణంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పలమనేరు ప్రాంతంలో అత్యధికంగా ఉన్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, డయాలసిస్ కోసం బయట ప్రాంతాలకు అనేక వ్యయప్రయాసల కోర్చి వెళుతున్న దృష్ట్యా ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాకుండా పట్టణంలో రోడ్లను, పలు కూడళ్లను, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగజేస్తున్న అక్రమ కట్టడాలు, ఆక్రమణలను కూడా తొలగించి ప్రజారవాణాకు సౌకర్యం కల్పించాలని కోరారు. జవిలి వీధిలో గతంలో మంజూరైన నూతనకాల్వ రామకృష్ణారెడ్డి కళాక్షేత్రం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, పెద్ద చెరువు మరమ్మతులు చేపట్టి పట్టణ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. పలమనేరు ఆర్టీసీ డిపో నిర్వీర్యమై పలు సర్వీసులు రద్దుచేసినందు వల్ల ప్రజల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నందున గతంలో రద్దయిన సర్వీసులన్నీ పునఃప్రారంభించి కొత్త బస్సులు కూడా డిపోకు కేటాయింపబడేట్లుగా చూడాలని కోరారు. సమస్యలన్నింటిని విన్న శాసనసభ్యులు సానుకూలంగా స్పందిస్తూ అన్ని సమస్యలను తప్పక పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమితి సభ్యులు విజయ్ కుమార్ పొన్నుడి, మురళి నారాయణ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా వెంకట నరసింహులు

ప్రజాశక్తి- పలమనేరు: నూతన ఎస్సై వెంకట నరసింహులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా ఉన్న శివశంకర్ పుంగనూరు నియోజవర్గ పరిధిలోని సోమలకు బదిలీ కాగా గతంలో సోమలలో ఎస్సైగా విధులు నిర్వహించిన వెంకట నరసింహులు అక్కడ నుండి బదిలీపై పలమనేరుకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సోమల ఎస్సైగా శివ శంకర్

ప్రజాశక్తి- సోమల: సోమల మండల ఎస్సైగా శివ శంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పలమనేరు నుండి బదిలీపై సోమలకు వచ్చినట్లు ఆయన తెలిపారు. నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శివశంకర్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి మంద రామనాథం, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు ప్రభుకుమార్, ఎంఎస్పి మండల అధ్యక్షులు ప్రకాష్, యువ నాయకులు శుభకర్, సీనియర్ నాయకులు వెంకట రామయ్య ఎస్సై సన్మానించి పూలమాలతో సత్కరించారు.

టిడిపిలో ఆర్వీటీ బాబు సేవలు కీలకం

యూత్ ప్రెసిడెంట్ శ్రీరామ్ చిన్నబాబు



ప్రజాశక్తి- పుంగనూరు: నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యున్నతిలో యూత్ ఐకాన్ ఆర్‌విటి బాబు సేవలు కీలకంగా ఉపయోగపడ్డాయని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు అన్నారు. బుధవారం ఆయన పుంగనూరులో ఆర్వీటి బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చల్లాబాబు విజయం కోసం అహర్నిశలు తపించడమే కాక నియోజకవర్గ వ్యాప్తంగా చల్లా బాబు వెన్నెంట ఉండి పార్టీ ప్రచారాలకు ఆర్వీటి బాబు ఎంతగానో సహకరించారని, నియోజకవర్గంలో యువకులకు మార్గదర్శకంగా ఉండి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆర్వీటి ఆధ్వర్యంలో ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆర్వీటి బాబును పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ఘనంగా సత్కరించారు. బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ యువజన విభాగాలు విస్తృతంగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి గ్రామంలోనూ తెలుగుదేశం పార్టీ యువజన సంఘాలు సారథ్యంలో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. ఆర్వీటీ యూత్ నాయకులు విజయభాస్కర్, హరీష్, కిషోర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పని తాగునీటి కష్టాలు

అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులకు కరువు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణం కొత్తపేట 12వ వార్డు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే మురికివాడగా పేరున్న షికారికాలనీ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. పాఠశాల పరిధిలో పారిశుధ్యం లోపించి కంపు కొడుతున్న పరిస్థితి నెలకొందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో విద్యార్థులు రోగాల భారిన పడితే దిక్కు ఎవరంటూ విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నీటి సమస్యతో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారిందని, కనీసం విద్యార్థులకు తాగడానికి మంచినీరు సైతం అందుబాటులో లేదని తెలిపారు. పాఠశాల ఆవరణలో బోరు బావి ఉన్నా గుక్కెడు నీటి కోసం పాఠశాల ప్రహరీ గోడ దాటి బయటకు రావలసిన పరిస్థితి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో గల బోరుబావి నుండి షికారి కాలనీ ప్రాంతానికి నీటి సరఫరా చేస్తున్న అదే నీరు విద్యార్థులకు మాత్రం అందించడం లేదని ఆవేదన చెందారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆరోపిస్తున్నారు. 2019 -24 మధ్యకాలంలో వైసిపి ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలను మార్చామని, విద్యావ్యవస్థలో కొత్త మార్పులు తీసుకువచ్చి సంచలనం సృష్టించామని అప్పటి అధికార ప్రభుత్వం చెప్పుకుంది. నాడు -నేడు పథకం సైతం తమ పాఠశాల పరిస్థితులను మార్చలేక పోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో నూతనంగా మరుగుదొడ్లు నిర్మించిన అవి వినియోగంలోనికి రాకపోవడంతో విద్యార్థులు మలమూత్ర విసర్జనకు సైతం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ పరిణామాలతో ఇప్పుడైనా తమ పాఠశాల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్న ఆశాభావాన్ని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం వ్యక్తం చేస్తున్నారు.



క్రైం న్యూస్

ఎద్దు పొడిచి వ్యక్తి మృతి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: ఎద్దు పొడిచి ఓ వ్యక్తి మరణించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జయగోపాల్ నాయుడు కుమారుడు జయచంద్ర నాయుడు(37) ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో జరిగే ఎద్దుల పండుగలకు ఎద్దులను తరలించి పోటీల్లో పాల్గొనేవాడు. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రంలోని కొన్ని రోజులకు ముందు పోటీల కోసం ఓ ఎద్దును కొన్నాడు. బుధవారం పొలం వద్ద కట్టేసి ఉండగా ఎద్దు ఉన్నట్లుండి జయచంద్ర నాయుడి ఛాతిపై పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతన్ని బైరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అధిక రక్తస్రావంతో అతను అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య సుగుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్



ప్రజాశక్తి - రామకుప్పం: వాహనం చోరీ చేసి పారిపోతున్న ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను బుధవారం అరెస్ట్ చేసినట్టు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ మీడియా సమావేశంలో తెలిపారు. రామకుప్పంలో ఇటీవల రూ.1,75,000ల విలువ చేసే వాహనం చోరికి గురైంది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, కుప్పం డిఎస్పీ శ్రీనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు తమిళనాడు రాష్ట్ర సరిహద్దుల్లోని ఆరిమానిపెంట చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కాగా ఆ ప్రాంతానికి వచ్చిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రభు (56), పలని (38), వాహిత్ మాలిక్ (30) అనే ముగ్గురు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు అనుమానించి వారిని అదుపులోనికి తీసుకొని విచారించగా రామకుప్పంలో అశోక్ లెలాండ్ వాహనం చోరి చేసినట్టు తేలిందన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రివార్డ్ అందించినట్లు సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు.

బైక్ దొంగలు అరెస్ట్



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని నల్లరాళపల్లె వద్ద బైక్ దొంగతనం కేసులో ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఇన్చార్జి సీఐ లక్ష్మన్న పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు నల్లరాళపల్లె వైయస్సార్ కాలనీలో నెల రోజుల క్రితం మణి అనే వ్యక్తికి సంబంధించిన మోటార్ సైకిల్ దొంగతనం కేసులో తమిళనాడులోని తిరువన్నామలై జిల్లాకు చెందిన అసనంపేటకు చెందిన పి.దినేష్ ఆర్.అన్నామలై, వడనంబాకంకు చెందిన ఎం.కరుణాకర్‌లను అరెస్టు చేసి మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు లక్ష్మన్న తెలిపారు. తమిళనాడులో ఈ బైక్ దొంగలపై పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన స్కూల్ బస్సు

తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి- వి కోట: మండల కేంద్రమైన వికోటలోని నారాయణ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు ప్రమాదవశాత్తు అదుపు తప్పి రోడ్డు ప్రక్కకు వాలడంతో పెను ప్రమాదం తప్పింది. బుధవారం పాఠశాల విడిచిన తర్వాత సాయంత్రం విద్యార్థులను వారి ఇంటి వద్ద దించేందుకు వెళుతున్న స్కూల్ బస్సు నక్కనపల్లి గ్రామం వద్ద మరో బస్సును అధికమించే క్రమంలో పక్కకు వాలింది. సుమారు 30 మంది విద్యార్థులతో బయలుదేరిన బస్సు ప్రమాదానికి గురి కావడంతో బస్సులోని విద్యార్థులను సమీప ప్రజలు క్రిందకు దింపారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడం పట్ల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. సంబంధిత అధికారులు ప్రైవేట పాఠశాలలకు చెందిన బస్సు యాజమాన్యాలకు విద్యార్థులను తరలించే సమయంలో బస్సులు కండిషన్ సక్రంగా ఉండే విధంగా చూడాలని ప్రయాణ సమయంలో తగు జాగ్రత్తలు పాటించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.